క్లుప్తంగా

వనమహోత్సవంలో భాగస్వాములు కావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హన్మకొండ అర్బన్ : వనమహోత్సవంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో గ్రీన్‌ల్యాండ్ ప్రాజెక్ట్ వ్యవస్థాపకుడు, కోఆర్డినేటర్ డాక్టర్ ఆచార్య రవికుమార్ రూపొందించిన «స్మృతి వనం–గ్రీన్ ల్యాండ్ ప్రాజెక్ట్» పోస్టర్‌ను ఆవయన ఆవిష్కరించారు. భవిష్యత్ తరాలకు పర్యావరణ పై అవగాహన పెంపొందించేలా ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

నర్సింహారెడ్డికి బెస్ట్ ఫార్మాస్యూటికల్ అవార్డు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ వై.నర్సింహారెడ్డి న్యూఢిల్లీలోని ఫార్మ్‌లోక్ సంస్థ నుంచి ప్రొఫెసర్ అంబికానందన్ మిశ్రా మెమోరియల్ బెస్ట్ ఫార్మాస్యూటికల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును న్యూఢిల్లీలో అక్టోబర్ 5న నిర్వహించిన నేషనల్ ఫార్మా సమ్మిట్ 2025 కార్యక్రమంలో ప్రకటించటంతో పాటు ఆ అవార్డును నర్సింహారెడ్డికి అందజేశారు. నర్సింహారెడ్డిని బోధన, బోధనేతర, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం బీఓఎస్‌గా రాధిక



రాధికకు ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్.రాధికను నియమిస్తూ మంగళవారం రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లపాటు చైర్మన్‌గా ఆమె బాధ్యతలను నిర్వర్తించనున్నారు. వీసీ రాధికకు ఉత్తర్వులు అందజేశారు.

అనితారెడ్డికి ఇంటర్నేషనల్ పీస్ అవార్డు



కేయూ క్యాంపస్ : అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు, వరల్డ్ వైజ్ కస్టమర్ రైట్స్‌అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ కె అనితారెడ్డికి ఆంధ్రప్రదేశ్‌లోని ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్ ఇంటర్నేషనల్ పీస్ అవార్డును ఎంపికచేసి అందజేసింది. 30 ఏళ్లుగా ఆమె చేస్తున్న సామాజిక సేవలకు ఈ అవార్డుకు ఎంపిక చేశామని మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి మంగళవారం తెలిపారు.

వీసీని కలిసిన విద్యాకళాశాల ప్రిన్సిపాల్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని విద్యా కళాశాల ప్రిన్సిపాల్ అండ్ విభాగం అధిపతిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నల్లాని శ్రీనివాస్ మంగళవారం కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డిని, రిజిస్ట్రార్ రామచంద్రంను వేర్వేరుగా కలిసి పూలబొకేలను అందజేశారు. తనను ప్రిన్సిపాల్‌గా నియమించినందుకు వీసీ,రిజిస్ట్రార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట కేయూ పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్, జర్నలిజం విభాగంఅధిపతి డాక్టర్ సంగాని మల్లేశ్వర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ కోలశంకర్ ఉన్నారు.

మెట్టుగుట్ట మాజీ డైరెక్టర్ మృతి

హన్మకొండ: మెట్టుగుట్ట మాజీ డైరెక్టర్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మడికొండకు చెందిన మూల వీరస్వామి మెట్టుగుట్ట మాజీ డైరెక్టర్‌గా పనిచేశాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందగా మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన భౌతికకాయానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మెట్టుగుట్ట మాజీ చైర్మన్ పైడిపాల రఘుచందర్, వస్కుల శంకర్, బైరి లింగమూర్తి, దువ్వ విజయ్, రసజ్ఞ, గౌతమ్‌లు పరామర్శించారు.

బుల్లెట్ వాహనాలపై ప్రత్యేక దృష్టి

- సైలెన్సర్ల తొలగింపు.. జరిమానా విధింపు
- ప్రత్యేక తనిఖీలు చేస్తున్న పోలీసులు



కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో బుల్లెట్ వాహనాల సైలెన్సర్లను తొలగిస్తున్న మెకానిక్

కాజీపేట : సైలెన్సర్లు మార్చి పట్టణంలో భారీ శబ్ధలతో బుల్లెట్ వాహనాలపై తిరుగుతున్న వాహనదారులపై కొద్ది రోజులుగా ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. పట్టణ రహదారులపై కొంతమంది యువకులు వేగంగా దూసుకెళ్లడంతో పాటు భారీ వింత శబ్దాలు చేస్తూ బాటసారులతో పాటు వాహనదారులను భయాందోళనలకు గురి చేస్తున్నారు. వారి ఆగడాలకు చెక్ పెట్టాలంటూ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశించడంతో ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ వెంకన్నలతో పాటు సిబ్బంది కలిసి ఇటీవలి కాలంలో బుల్లెట్ వాహనాలను ఆపి సైలెన్సర్లను తనిఖీ చేస్తున్నారు. భారీ శబ్దాలు చేసే వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సైలెన్సర్లను మెకానిక్ ద్వారా తొలగిస్తున్నారు. వాహన యజమానులు అప్పటికప్పుడు తెచ్చుకునే కొత్త సైలెన్సర్లను మెకానిక్‌తో బిగించి ఇస్తున్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వాహనదారులతో జరిమానా కట్టించుకుని ట్రాఫిక్ పోలీసులు వదిలేస్తున్నారు. లా అండ్ ఆర్డర్ పోలీసులు కూడా ఆకతాయి యువకుల వాహనాలను పట్టుకుని సైలెన్సర్లు మార్పించడంతో పాటు జరిమానాలు విధించి తగిన రీతిలో బుద్ధి చెబుతున్నారు. ఇష్టానుసారంగా పెద్దపెద్ద శబ్దాలతో జులాయిగా తిరుగుతున్న వారిపై తగిన చర్య తీసుకుంటున్న పోలీసులను పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.

అద్దె బస్సుల పార్కింగ్‌కు ‘కుడా’ స్థలం లీజ్



‘కుడా’ చైర్మన్ వెంకట్రామ్ రెడ్డిని సన్మానిస్తున్న ఆర్టీసీ అద్దె బస్సుల సంక్షేమ సంఘం నాయకులు

హన్మకొండ : ఆర్టీసీ అద్దె బస్సుల పార్కింగ్ కోసం బాలసముద్రంలోని ‘కుడా’ స్థలాన్ని లీజ్‌కు ఇచ్చారు. ఆర్టీసీలో నడుస్తున్న అద్దె బస్సులు హనుమకొండలోని బస్‌స్టేషన్ కూడలి, కాకాజీకాలనీ, సర్క్యూట్ గెస్ట్‌హౌజ్ రోడ్, హనుమకొండ డిపో వద్ద పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ట్రాఫిక్ పోలీసులు బాటసారులు పడుతున్న ఇబ్బందులు, కలుగుతున్న అసౌకర్యాన్ని గుర్తించి అద్దె బస్సుల యజమానులతో సమస్య పరిష్కారంపై చర్చించారు. ఈ క్రమంలో పోలీసు యంత్రాంగం, అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం నాయకులు బాలసముద్రంలోని ‘కుడా’ పరిధిలోని స్థలాలు పరిశీలించారు. ఈ మేరకు ‘కుడా’ చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్మన్, వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. పరిశీలించిన వారు మైదానాన్ని లీజ్‌కు ఇచ్చింది. కాగా మంగళవారం ‘కుడా’ కార్యాలయంలో చైర్మన్‌ను ఆర్టీసీ అద్దె బస్సుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు లక్కం ప్రభాకర్, వరంగల్ రీజియన్ అధ్యక్షుడు మారిపల్లి రాంరెడ్డి, నాయకులు కలిసి శాలువా కప్పి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కు ధన్యవాదాలు తెలిపారు. దీపావళి సందర్భంగా బాణసంచా షాపులకు అనుమతి ఇచ్చినందున దీపావళి తర్వాత స్థలాన్ని అప్పగించనున్నట్లు చైర్మన్ వెంకట్రామ్ రెడ్డి తెలిపారు.

వాల్మీకి మహర్షి ఉత్సవాలు ప్రారంభం



వాల్మీకి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు



మామునూరు : వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ పూజ

హన్మకొండ : మడికొండలో పెద్దమ్మగుడి ముందు స్థలంలో వాల్మీకి నవరాత్రోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా వాల్మీకి చిత్రపటాన్ని వాల్మీకి భవనం నుంచి డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా పెద్దమ్మ గుడి ఎదురుగా ఏర్పాటు చేసిన మంటపం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం వాల్మీకి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వాల్మీకి సంఘం అధ్యక్షుడు బోగి లింగమూర్తి, తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రచించిన వాల్మీకి రామయణం ఎంతో గొప్పదని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవాల రాధిక నరోత్తమ్‌రెడ్డి, వెంకటప్రసాద్, వెంకటయ్య, లింగయ్య, సాంబయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

మామునూరు : మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో మంగళవారం వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు

హసన్‌పర్తి: ఒకటోవ డివిజన్ పెగడపల్లిలోని ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారణ్యపురి : హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో సంస్కృత విభాగం ఆధ్వర్యంలో వాల్మికి జయంతివేడుకలను నిర్వహించారు. ఈసందర్బంగావాల్మీకి చిత్రపటానికి ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని ఇతర అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

సంక్షిప్త సమాచారం

ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



రామన్నపేట : ఆటోడ్రైవర్లు తప్పక ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కోడూరి సుజాత ఆధ్వర్యంలో నగరంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ట్రాఫిక్ సిబ్బంది, 300 మంది ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 8న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నయీంనగర్, లష్కర్ సింగారం, రాజాజీనగర్, హంటర్ రోడ్ కనకదుర్గ కాలనీ, వాసవి కాలనీ, ఆంజనేయ దేవాలయం, టెంపుల్ ట్రీ విల్లా ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, కిషన్‌పుర, నయీంనగర్, శంకర్‌నగర్, కేయూ జంక్షన్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

పురావస్తుశాఖ డైరెక్టర్‌కు సన్మానం



కేయూ క్యాంపస్ : తెలంగాణ రాష్ట్ర పురావస్తు, సంగ్రహాలయాల (ఆర్కియాలజీ అండ్ మ్యూజియం) డైరెక్టర్ ఆచార్య అర్జున్‌రావు మంగళవారం కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై చర్చించిన అనంతరం వీసీ అర్జున్‌రావును దుశ్శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ టి.మనోహర్, కేయూ దూరవిద్యకేంద్రం డైరెక్టర్ సురేష్‌లాల్, హిస్టరీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు శ్రీనాథ్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

విద్యారణ్యపురి : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన, అలాగే ఇటీవలే నీతి ఆయోగ్ మినిస్టరీ ఆఫ్ ఎంఎస్ఎంఈ భారత ప్రభుత్వం ద్వారా మహాత్మాగాంధీ నేషనల్ సర్వీస్ అవార్డును పొందిన హనుమకొండలోని లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హిందీ స్కూల్ అసిస్టెంట్ సిహెచ్.రాములను మంగళవారం హైస్కూల్‌లో హెచ్ఎం ఉమ సన్మానించారు.

తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు

ఖిలా వరంగల్ : ఇటీవల ఖిలా వరంగల్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇక్బాల్‌ను మంగళవారం మండల రేషన్ డీలర్లు కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఇక్బాల్‌ను డీలర్లు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర రేషన్ డీలర్ల జాయింట్ సెక్రటరీ సూర్యనారాయణ, రామ సదానందం, భాస్కర్, అశోక్ పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ హత్యాకాండను ఖండించండి



వరంగల్ చౌరస్తా : పాలస్తీనా ప్రజలపై జీనోసైడ్ హత్యాకాండకు పాల్పడుతూ ఇజ్రాయిల్ జరుపుతున్న దురాక్రమణ దాడులు ప్రజా స్వామిక వాదులు ఖండించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.శ్రీనివాస్ కోరారు. హత్యాకాండ, దురాక్రమణ దాడులు మంగళవారం నాటికి రెండేళ్ల సందర్భంగా వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో గ్రేటర్ కార్యదర్శి రాచర్ల బాలరాజు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, అధికార ప్రతినిధి గంగుల దయాకర్, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బం కోటేశ్వరరావు, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాంబయ్య, జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి, పాల్గొన్నారు.

సట్టా గేమ్ నిర్వాహకుడి అరెస్టు

రామన్నపేట : ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధి వరంగల్ చౌరస్తా సమీపంలో సట్టా గేమ్ నిర్వహిస్తున్న ఎండీ. అమీర్‌ఖాన్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. అతని నుంచి రూ. 5160 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పార్టీపై ఆరోపణలు చేయడం సరికాదు

ఖిలా వరంగల్ : సీపీఎం వ్యతిరేకులు సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు ప్రచారం చేయడం సరికాదని, దీనిని పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య అన్నారు. మంగళవారం వరంగల్ ఉర్సుగుట్ట సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఎల్లప్పుడు ప్రజల సమస్యలను పరిష్కరించడానికే కృషి చేస్తుందని అన్నారు. వేలాది మందికి గుడిసెలు వేయించి నిలువనీడ కల్పించిన పార్టీ నాయకులు ప్రాణాలు అర్పించిన చరిత్ర కలిగిఉందని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా సీపీఎం నాయకులపై చేసే దుష్ప్రచారాన్ని ప్రజలందరూ తీవ్రంగా ఖండించాలని కోరారు. కార్యక్రమంలో ఆరూరి కుమార్, వలదాసు దుర్గయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

కంచె అయిలయ్యకు చిత్రపటం బహూకరణ



మామునూరు: మామునూరు పీవీ నరసింహారావు విద్యాలయంలోని పశువైద్య కళాశాలలో పశుపునరుత్పత్తి విభాగం అధిపతి ప్రొఫెసర్ కంచె అయిలయ్యకు మంగళవారం ప్రొఫెసర్ రాంసింగ్ గీసిన ప్రొఫెసర్ కంచె అయిలయ్య చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్, సునీత్ ఆనంద్‌కుమార్, డాక్టర్ అశోక్, డాక్టర్ సురేష్ నాయక్ పాల్గొన్నారు.

సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం

వరంగల్ చౌరస్తా : గోవిందరాజుల గుట్ట శ్రీ దేవి భూదేవి నీలాదేవి, గోవిందరాజు దేవాలయంలో మంగళవారం నిర్వహించిన సాముహిక విష్ణు సహస్ర పారాయణం పఠన కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. మంగళశాసనం చేసి తీర్థ శతగోప ప్రసాదములు పంపిణీ చేశారు. గోవిందాద్రి గోశాల విష్ణు సహస్రనామ పారాయణ వ్యవస్థాపక అధ్యక్షుడు గర్నెపల్లి మాధవి సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాస్, గోశాల వ్యవస్థాపకులు లక్ష్మణస్వామి, ప్రసాద్, మురళీకృష్ణ, విష్ణు సహస్రనామ భక్తుల బృందం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చార్ట్ మెటీరియల్ అందజేత

విద్యారణ్యపురి : విద్యా వికాస ప్రేరణ ఫౌండేషన్, స్ప్రింగ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జిల్లా మాజీ కమ్యూనిటీ మొబలైజింగ్ కోఆర్డినేటర్ బి.రాధ, ఇంజనీర్ ఉపేందర్‌రెడ్డి మంగళవారం కాజీపేటలోని బోడగుట్ట ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు స్టేషనరీ, బోధన చార్ట్‌ల మెటీరియల్‌ను అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి



మాజీ ఎంపీ వినోద్ కుమార్, వినయ్‌భాస్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

- విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

హన్మకొండ: బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌కు ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం హనుమకొండ కాకతీయ కాలనీలోని స్వగృహంలో వినోద్ కుమార్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 30 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకుంటున్న 200 బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.180 కోట్ల ఫీజు బకాయి ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలన్నారు. ఉమ్మడి జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులను దసరా సెలవులు తర్వాత యాజమాన్యాలు పాఠశాలకు అనుమతించడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తే తప్ప తాము విద్యార్థులకు విద్యాబోధన చేయలేమని చేతులెత్తేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్ల బిల్లులను విడుదల చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల స్కూళ్లకు ఫీజులు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శోభన్ బాబు, రమేశ్‌బాబు, చింతల యాదగిరి పాల్గొన్నారు.

నేటి తరానికి స్ఫూర్తి కొమురం భీం

- కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి



కేయూ క్యాంపస్ : మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి



హన్మకొండ : కొమురం భీం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వినయ్‌భాస్కర్, నాయకులు

కేయూ క్యాంపస్ : నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత కొమురంభీం అని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూ జాతీయ సేవాపథకం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అధ్యక్షతన జువాలజీ విభాగం సెమినార్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన కొమురం భీం వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆదివాసీల ఆత్మగౌరం, జీవనాధారాల కోసం, ఆదివాసీల హక్కుల కోసం జల్‌జంగిల్, జమీన్ కోసం కొమురం భీం పోరాటాలు చేశారని కొనియాడారు. కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఆచార్య వై.వెంకయ్య, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ఆచార్య ఇస్తారి, కేయూ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

హన్మకొండ : జల్ జంగల్ జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమురం భీం అని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కొమురంభీం చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, బీ ఆర్ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

జమీల్ చేసిన సేవలు మరువలేనివి



జమీల్ అహ్మద్‌కు జ్ఞాపిక అందజేసి సన్మానిస్తున్న సహోద్యోగులు

న్యూశాయంపేట : భారతీయ జీవిత భీమా సంస్థలో సీనియర్ బిజినెస్ అసోసియేట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా జమీల్ అహ్మద్ చేసిన సేవలు మరువలేనివని ఎల్ఐసీ వరంగల్ డివిజన్ మార్కెటింగ్ మేనేజర్ గోపాలకృష్ణ అన్నారు. ఇటీవల పదవీ విరమణ చేసిన జమీల్ అహ్మద్‌ను మంగళవారం వరంగల్‌లోని ఓ సమావేశ హాల్‌లో తోటి ఉద్యోగులు ఏజెంట్స్ ఏర్పాటు చేసిన సన్మాన సభలో గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. డీఓగా 600కు పైగా ఏజెంట్స్‌ను నియమించి సంస్థ ఎదుగుదలకు దోహదం చేశారని కొనియాడారు. డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ సంఘం నాయకులు విజయ్‌కుమార్, సెక్రటరీ బాలభక్తుల శ్రీహరి తన కవితలతో సభను అలరించారు. బ్రాంచ్ మేనేజర్ భానుకుమార్, బీడీబీఎస్ మేనేజర్ సుధాకర్, రిటైర్డ్ మేనేజర్ నాగేశ్వర్ రావు, ఏఓ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం చెరువు సర్వే

హసన్‌పర్తి : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 56వ డివిజన్ గోపాలపురం చెరువు సర్వే చేశారు. చెరువు శిఖం కబ్జాకు గురైనట్లు ప్రజాతంత్ర వేదిక వ్యవస్థాపకుడు తుపాకుల దశరథంలో పాటు మరికొంత మంది హైకోర్టును ఆశ్రయించారు. రెవెన్యూ రికార్డుల మేరకు సర్వే నంబర్ 89లో సుమారు 20.01 ఎకరాల్లో చెరువు విస్తరించి ఉందని ఫిర్యాదుదారులు పిటిషన్‌లో పేర్కొన్నారు. కొంతమంది రియల్టర్లు సర్వే నంబర్ 90 భూమిలో రిజిస్ట్రేషన్ చేసి, 89లో నిర్మాణాలు చేపట్టారని పిటిషన్‌లో వివరించారు. వివిధశాఖల అధికారులు ఇందుకు పూర్తిగా సహకరించాలని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు వారం క్రితం భూములు కొలతలు, రికార్డుల కార్యాలయ అధికారులు నోటీసులు జారీచేశారు. హనుమకొండ తహసీల్దార్, సర్వేయర్, ఆర్ఐ, డిప్యూటీ కమిషనర్, కాజీపేట నీటిపారుదల శాఖ ఈఈతోపాటు దశరథంకు నోటీసులు ఇచ్చారు. మంగళవారం భూములు కొలతలు, రికార్డులు కార్యాలయ అధికారి శ్రీనివాస్ క్షేత్రస్థాయిని సందర్శించి కొలతలు వేశారు. ఇందుకు సంబంధించిన నివేదికను కూడా సిద్ధం చేశారు.

సీజేఐపై దాడి అమానుషం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి అమానుషమని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం దాడిని ఖండిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మోదీ సర్కార్ ఏర్పడ్డాక రాజ్యాంగ వ్యవస్థలపై ధ్వంసం చేస్తూ సైద్ధాంతికంగా ఒక పథకం ప్రకారం రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించిన న్యాయవాది రాకేశ్‌కిశోర్‌ను కఠినంగా శిక్షించాలని నిరసిస్తూ విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పలుచోట్ల ఆయా సంఘాల ప్రతినిధులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు



హన్మకొండ : అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు



హన్మకొండ చౌరస్తా: నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు



కేయూలో నిరసన తెలుపుతున్న పరిశోధకులు



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు



ఖిలావరంగల్ : శంభునిపేట జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం శ్రేణులు